రచన ఉగాది ప్రత్యేక సంచిక - మార్చి 1997

# నిర్ణయం

మా అమ్మాయి దేవికి ఇరవై రెండు ఏళ్ళు దాటాయి. దాని చేతిలో ఇంగ్లీషు లిటరేచర్ తాలూకు మాస్టర్ డిగ్రీ, ఆపైన ఈనాటి బ్రతుకు తెరువుకు ఆలంబనగా వుండే, కంప్యూటర్స్‌లోనూ, బిజినెస్ ఎడిమినిస్ట్రేషన్‌లోనూ పి.జి. డిప్లమాలు ఉన్నాయి. దాంతో దానికి నెలకు ఆరు వేల రూపాయలు చేతిలో పడే ఉద్యోగం దొరికింది. ఇంటిల్లిపాది సంతోషించాం. అయితే నేను మాత్రం అదంతా నా పూజే అనుకుని గర్వపడకపోలేదు.

కానీ అలాంటి సమయాల్లోనే గోడలకున్న ఫోటోల్లోని దేవుళ్ళూ, ఇతర మహాపురుషులు కళ్ళపడగానే నేను నాలిక కరుచుకుని, మనసులో,'అంతా మీ చలవే, నాదేం లేదు.... మన్నించండి' అంటూ చేతులు జోడించేస్తాను. 'మీ అమ్మాయి బుద్ధిమంతురాలు, బాగా చదువొచ్చింది, ఉద్యోగం కూడా దొరికింది కాబట్టి మంచి సంబంధం చూసి పెళ్ళి కానిచ్చేయండి' అంటూ హితులు, బంధువులూ నాకు సలహాలు ఇవ్వడం మొదలుపెట్టారు. ఈ మధ్య దేవి నాకు చేదుడో వాదోడుగా వుంటోంది. దాని మాట చెవిని పడకపోతే, ముత్యాలున్న పాంజెవి పట్టాలు శబ్దం చేసుకుంటూ దాని నడక వినపడకపోతే నాకు అదోలా వుంటుంది!

నిజమే! దేవికి చిన్నప్పటి నుంచీ నా దగ్గర చనువు ఎక్కువ. అది గారాలు పోవడం, నేను ఆ గారాలకు వంత పాట పాడడం అదో నిత్యకృత్యం అని రాజేశ్వరి నిత్యం ధుమధుమలాడుతూనే వుంటుంది. పైగా తరుచు, తరుచేమిటి, రోజులో చాలాసార్లు నాతో విభేదించే రాజేశ్వరికి నేను నచ్చలేనప్పుడు – దేవి ముందుకు వచ్చి తల్లిని నేర్పుగా రాజీపడేటట్టు చేస్తుంది... దాని మాట తీరు, లౌక్యం, ఇంకా ఇంకా గడుసుతనం చూస్తే నాకు ముచ్చట వేస్తుంది.

"నాకర్థం అయ్యింది లెండి. కాపురానికి వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. అప్పట్లో మీరూ, మీ అమ్మా కలిసి సాధించారు. ఆవిడ వెళ్ళిపోయింది. ఇప్పుడు చల్లగా కూతుర్ని నా మీదకు ఉసిగొల్పుతున్నారు. మీరిచ్చిన అలుసు చూసుకుని అది అరిందా ఐ నాకు చెప్తోంది." అంటూ రాజేశ్వరి వంటింట్లోంచి చాలాసార్లు స్వగతంగా అంటుంది. నేను వెంటనే రాజేశ్వరి దగ్గరకు వెళ్ళి, "నువ్వు అనవసరంగా అపోహ పడుతున్నావే... అది నాకు గానీ, నీకు గానీ సలహాలు యిచ్చేది కొంత కాలమే... రేపు పెళ్ళి అయి, దేవి వెళ్ళిపోతే – అది లేని లోటు నా కన్నా నీకే ఎక్కువగా తెలుస్తుంది... చెయ్యి విరిగినట్టు బాధపడతావు" అన్నాను.

"ఆ, దాని పనిపాటలే చెప్పుకోవాలి. వంకాయలు, తరిగితే పుచ్చుల్ని పసిగట్టడం తెలియదు... ఉల్లిపాయలు వలుస్తూ ముక్కూ, మొహం ఏకం చేసుకుంటుంది... ఎంగిలి కంచాలు ముట్టుకోవాలంటే నామోషి" అంటూ రాజేశ్వరి దేవీ స్తోత్రం మొదలుపెట్టి, ఆఖరిగా అంది, "రేపు పెళ్ళి చేసిన తర్వాత తెలుస్తుంది... దాని అత్తగారూ ఆడబడుచులు నాకు పెడతారు, శాపనార్థాలు."

"చదువుకున్న అత్తగారిని చూసి, ఆ ఇంటే యిద్దాం దేవిని. సరేనా..." రాజేశ్వరిని నవ్విస్తూ అన్నాను. రాజేశ్వరి చిన్నగా నవ్వేసి, "అప్పుడు తల్లినీ, పెళ్ళాన్నీ కూర్చోబెట్టి చేసి పెట్టే అబ్బాయి దొరకాలి... లేకపోతే ఆ పని కూడా నా నెత్తిన పడుతుంది." అంది.

"అది అదృష్టవంతురాలే. ఇంటి పనులు రానంత మాత్రాన, వంటింటిని మాస్టరీ చేయనంత మాత్రాన దానికేలోటూ రాదు... చదువయ్యింది. ఇప్పుడు చేసేది ఎగ్జిక్యూటివ్

జాబ్... ఉద్యోగంలో టెన్షన్ వుంటుంది. అర్థం చేసుకో..."

రాజేశ్వరి ఆశ్చర్యంగా నన్ను చూసి, "నా విషయంలో మా నాన్న ఈపాటి ఆలోచించలేకపోయాడు. అవును కదండీ" అంది, పకపకా నవ్వేస్తూ.

"ఆ విషయం నాకు తెలియదుగానీ – నాకు మాత్రం ఆయన 'బంగారం లాంటి అల్లుడివి దొరికావు బాబూ' అంటూ కితాబులు యిచ్చేవారు. అది మాత్రం గుర్తు..." అన్నాను.

"అల్లుడు కదా, బావుండదని అలా అని ఉంటారు. నిజం ఆయనకు తెలుసు..."

"అదేం కాదు.. ఆయన తెలివితేటలు, మంచితనం నువ్వు పుణికి పుచ్చుకోలేదు".

"అవును లెండి... అవన్నీ మీ అమ్మాయికి వచ్చాయి."

నేను నవ్వేశాను... "అందుకే అంటున్నాను. అది అదృష్టవంతురాలని.."

రాజేశ్వరి నా పక్కన సోఫాలో చోటు చేసుకుని కూర్చుంది. పమిట కొంగుతో మొహం తుడుచుకుంది. ఓసారి నా వైపు చూసి, "నే చెప్పేది బాగా వినండి. ఇప్పటికి దేవికి పది సంబంధాలు చూశాం. ఏ ఒక్కణ్ణీ అది ఒప్పుకోవడం లేదు. ఏదో వంకలు పెడుతుంది... కనీసం మొన్న చూసిన సంబంధమైనా కుదిరితే బాగుంటుంది... చదువుకున్నాడు. మంచి ఉద్యోగం" అంది, నాకు నచ్చచెబుతూ.

"నువ్వు దాన్ని అడిగావా? అదే మంది?"

"అది నాతో చెబుతుందా? అయినా నిలేసి అడిగా.. ఏ విషయం నాన్నతో చెప్తానంది."

నేను నెమ్మదిగా అన్నాను. "నిన్న నేనడిగితే – తన అభిప్రాయం నీతో చెప్పానందే.."

"నాతోనా?"

"అవును. బహుశా ఆ సంబంధం మీ ఇద్దరికీ నచ్చి వుండదనీ – అందుకే మీరు ఏం మాట్లాడలేదనీ నేను అనుకుంటున్నాను..."

"అవ్వ"... అంది నోరు నొక్కుకుని రాజేశ్వరి...

"ఎవరి అవ్వ.... మా అవ్వా... మీ అవ్వా..."

"నా తలకాయ... చాల్లెండి. మీరిద్దరూ కలిసి ఆడే నాటకం నాకు తెలియదనా... కానివ్వండి... ఇప్పుడు అర్థం కాదు – మీకు."

"భయపడకు అన్నీ సవ్యంగా జరుగుతాయి."

"ఈ మెట్ట వేదాంతాలకేం... ఎన్నైనా చెప్పొచ్చు. నలుగురూ అనుకుంటారనైనా లేదు.. నాకయితే రాత్రుళ్ళు నిద్రపట్టడంలేదు. ఏవేవో ఆలోచనలు వస్తాయి... మనకా పెద్ద వయసు వచ్చేసింది..."

"మనఫ్యామిలీ డాక్టర్ దగ్గరకు వెడదాం... ఆయన సైకియాట్రిస్ట్ కూడా"...

"అది ఈ గడప దాటితేనే నా రోగం తగ్గుతుంది. దీనికి వేరే డాక్టరూ మందులూ అవసరం లేదు."

నేను నవ్వేశాను. రాజేశ్వరి నా మొహంలోకి చూసి, తల దించుకుని, పమిటి కొంగు చేతుల్లోకి తీసుకుని అంచుల్ని రాస్తోంది...

"నా మాట వినండి... దానికి చిన్నతనం. పైగా మీరు చేసే ముద్దుతో అది వెనకా ముందూ ఆలోచించడం లేదు. ఆడపిల్లలకు మంచి చదువులు, గొప్ప ఉద్యోగాలూ అవసరమే. అలాగే, వయసులో వున్నప్పుడు, మనిషిలో కళానవకం వున్నప్పుడే కొత్త దంపతులు సరికొత్తగా కన్పించేది.."

"నాకు ఇరవై ఐదు ఏళ్లు రాకుండానే మన పెళ్ళి అయింది. నాకా విషయం తెలియదా రాజేశ్వరీ?"

"తెలిసీ తెలియని వయసు – తెలుస్తూనూ, తెలుసుకుంటూనూ ముందుకు అడుగులు వేయడం, సరికొత్త జీవితంలో అంతకన్నా సరికొత్తవి అయిన పొరబాట్లు చేస్తూ నాలిక కరుచుకుంటూ, నవ్వుకుంటూ నడవడం... భవిష్యత్ మీద బోల్డు ఆశ... యివి లేత ప్రాయంలోనే అనుభవంలోకి రావాలండీ? అంతేగానీ ముప్ఫై ఏళ్లు వచ్చిన తర్వాత ప్రపంచం అంతా అర్థమయిపోయిన తర్వాత – జీవితానుభవం గడ్డకట్టుకుపోయిన తర్వాత పెళ్ళిళ్ళు చేసుకుంటే...ఏం అందం??"

నాకు రాజేశ్వరి మాటలు ఆశ్చర్యాన్నే కాదు, ఆలోచనల్నీ రేకెత్తించాయి... ఎంతో నిండుగా, సంతృప్తిగా ఆమె మొహంలోకి చూశాను. నిజమే – ఆ రోజే, ఆ ఉదయాన్నే వికసించిన పువ్వులోని లాలిత్యం – దానిదే! ఎండపొడ తాకిన తర్వాత, సృష్టి తాలూకు దిష్టి తగిలిన తర్వాత ఆ పువ్వులోని పరిమళం తరిగిపోవడం, తాజాతనం తగ్గడం సహజమే! అవును... వ్యక్తుల తాలూకు జీవితాలు కూడా అంతేనేమో!! నా ఆలోచనలుసాగకుండా, 'లేచి స్నానం కానివ్వండి' అంటూ రాజేశ్వరీ నన్ను హెచ్చరించి సోఫాలోంచి తను లేచింది.. నేను లేవక తప్పలేదు.

❖ ❖ ❖

రాత్రి పడుకోబోయేముందు రాజేశ్వరి "దానికి చెప్పవల్సినవన్నీ చెప్పాను. అది ఏం మాట్లాడలేదు. బెల్లం కొట్టిన రాయల్లే వుండిపోయింది. మీ ఇద్దరు ఏం చేసుకున్నా సరే... ఇక దాని పెళ్లి విషయంలో నేనేం కలగజేసుకోను." అంటూ అల్టిమేటం ఒకటి యిచ్చేసి గోడ వైపు తిరిగింది... అప్పుడు ఇంకా పది గంటలు కాలేదు... నేను నెమ్మదిగా మంచం మీద నుంచి లేచి హాల్లోకి వెళ్ళాను. దేవి గదిలో లైటు వెలుగుతోంది. ఏవో ఆఫీసు కాగితాలు చూసుకుంటూ కంప్యూటర్‌తో కుస్తీ పడుతోంది. నేను దేవి గది దాకా వెళ్ళి "ఇంకా నిద్రపోలేదా," అని పలకరించాను. దేవి పక్కకు తిరిగి నన్ను చూసి, "లేదు నాన్నగారూ... మీకు నిద్రపట్టలేదా.." అంది.

"పొడికళ్ళు పడ్డాయి" అంటూ కుర్చీలో కూర్చున్నాను. టేబుల్ మీద 'లిబరేషన్ ఆఫ్ ఉమెన్' అనే బులెటిన్ కనపడింది. అది తీసుకుని పేజీలు తిప్పాను.

"ఈ బులెటిన్ మీరు చదివారా నాన్న... పెళ్ళిళ్ళ గురించి, స్త్రీ, పురుషుల గురించి మంచి వ్యాఖ్యానాలు ఉన్నాయి, అందులో..." అంది.

నేను పుస్తకం తిప్పుతూనే, "అమ్మ నీతో మాట్లాడిందట కదూ" అని అడిగాను.

దేవి ఓ సారి నా వైపు చూసి, తల దించుకుంది... ఆపైన, 'అమ్మ మామయ్య తెచ్చిన సంబంధం మంచిది, సరే ననమంటుంది... నేనేమో" అంటూ తల్లికి తనకూ మధ్య జరిగిన సంభాషణ, అందులోసారాంశం టూకీగా చెప్పి, "అమ్మ కంగారు పడిందంటే తప్పులేదు నాన్నగారూ; కానీ... నాకు రెండు మూడేళ్ళు పెళ్ళి మాట తలపెట్టుకోకూడదని పిస్తోంది. ఉద్యోగం వుండనే వుంది. ఆ తర్వాత చూసుకుందాం. అంతవరకూ" మాటల్ని మధ్యలో ఆపేసింది.

"మనం ఏ కారణం లేకుండా వచ్చిన సంబంధాన్ని కాదన్నామనుకో... నష్టపోయేది ఎవరంటావ్?"

"ఇందులో లాభనష్టాల ప్రసక్తి ఏముంటుంది నాన్నగారూ... మీకు నేను చెప్పాలా... మంచి కారణం మీరే ఏదో ఆలోచించి పుణ్యం కట్టుకోండి... ప్లీజ్..."

"ఈ సంబంధం ఎందుకో నాకు అన్ని విధాలా తగిందనిపిస్తోంది... మరోసారి ఆలోచించు దేవీ... కావాలంటే నాలుగురోజులు టైం తీసుకో... ఆ తర్వాతే మన ఉద్దేశం చెబుదాం... సరేనా" అంటూ దేవి సమాధానం వినకుండా నేను నా గదిలోకి వెళ్ళాను... "లిబరేషన్ ఆఫ్ ఉమెన్" బులిటెన్ని మంచం మీద వాలి తిరగవేయడం మొదలుపెట్టాను. అందులో 'రంగ్స్ ఆఫ్ లవ్', 'లిబరేషన్ ఆఫ్ ది ఉమెన్' లాంటి శీర్షికలు ఉన్నాయి. ప్రేమ సాధారణ స్థాయిలో వున్నప్పుడు ఎటువంటి విష పరిణామాలకు దారితీస్తుందో.. స్వచ్ఛమైన ప్రేమ ఆత్మగతమై ఏ విధంగా ప్రకాశిస్తూ వుంటుందో పొందిగ్గా, అందంగా చెప్పారు. ఒకచోట ఎవరో పెన్‌తో అండర్‌లైన్ చేసిన వాక్యాల ముందు ఆగిపోయాను... అందులో – "ఆడది – మగవాడి మీద ఆధారపడి జీవించాలనీ, అతని మెప్పును పొందాలనే కోరికను అణచుకోగలిగినప్పుడు; తనకో ఇల్లూ, తన భద్రతా రక్షణా పట్ల అమితమైన ఆరాటాన్ని అదుపులో వుంచుకోగలిగినప్పుడు; పిల్లల్ని కని మాతృమూర్తి నవ్వాలనే గాఢమైన వాంఛను అధిగమించగలిగినప్పుడు – స్త్రీ నిజంగా స్వతంత్రురాలయినట్టే...!!" అలాగే మగవాళ్ళ గురించి వాళ్ళకూ ప్రత్యేకంగా కొన్ని సూచనలూ ఉన్నాయి క్రింద... అందులో – "మగవాడు ప్రతీ విషయంలోనూ తను, తనదీ అనే స్వార్థ చింతనను పక్కన పెట్టగలిగినప్పుడు; సంసార జీవనం ద్వారా లభించే అనేక సదుపాయాలను కాదనుకోగలిగినప్పుడు; రతి సుఖానికి అధిక ప్రాముఖ్యత యివ్వడం మానివేసిన నాడు మగవాడు కూడా ఆడదానితో సరిసమానుడవుతాడు..."

అలా సాగింది – ఆ బులెటెన్ వ్యాసం... హెచ్చరికగా చెప్పినా, వ్యంగ్యంగా, ఎత్తి పొడుపుగా అన్నా, ఆ మాటల్లో ఏదో సత్యం దాగి వుందనే అన్పించింది... పైగా ఈ

మంచి మాటలు ఆచరణలో పెట్టడానికి ప్రస్తుతానికి అవకాశాలు తక్కువ అని నిరాశపడకుండా కనీసం అర్థం చేసుకుంటే ఉపయోగం వుంటుందేమో... ఎందుకంటే ఈ మధ్యకాలంలో స్త్రీ పురుషుల మధ్య తలెత్తి, తేలకుండా వుండిపోయిన – 'ఆడా, మగాలో ఎవరెక్కువ, ఎవరు తక్కువ' అనే సమస్యా, ఆ పైన భార్యాభర్తల అనుబంధంలో నిత్యం అడ్డుపుల్లలు వేస్తూ – ఇంకా ఇంకా అడ్డుగోడలు నిర్మిస్తున్న ఆర్థిక, మానవ, నైతిక ఇంకా ఇంకా అనేక సమానత్వ సమస్యలు కొంతలో కొంత పరిష్కార మార్గం వైపు వెడతాయేమో??

అలా ఆలోచిస్తూ – ఆ పైన వాటిని ఆపి నిద్రకోసం ఎదురుచూడ్డం మొదలుపెట్టాను... పక్కన వున్న రాజేశ్వరి తన చిన్న గుర్రుతో నాకు జోలపాడుతోంది కూడా! అది రాకేం చేస్తుంది!!

❖ ❖ ❖

నేను వెళ్ళేసరికి పరబ్రహ్మంగారు వాకిట్లో పడక్కుర్చీలోకూర్చుని వున్నారు. పక్కనున్న సోఫాలో ఆయన భార్య ఉంది... నేను వారిద్దరికీ నమస్కారాలు చేసి నన్ను నేను మరోసారి పరిచయం చేసుకున్నాను. దేవి పెళ్ళిచూపుల నాటి సంగతులు గుర్తు చేశాను.

"ఎలా మర్చిపోతాను మిమ్మల్ని, కూర్చోండి రాఘవరావుగారూ" అంటూ ఆయన కుర్చీ చూపించాడు.

"నా బావమరిది శ్రీనివాసులు విజయవాడ నుంచి ఉత్తరం వ్రాశాడు... మిమ్మల్ని మరోసారి కలవమని... వీలు కుదరక పదిహేను రోజులుగా రాలేకపోయాను.."

మా మాటల మధ్యలోనే పరబ్రహ్మంగారి భార్య లేచి లోపలికి వెళ్ళింది. ఆ తర్వాత మేం లోకాభిరామాయణంలోకి అడుగుపెట్టాం... ప్రస్తుత గడ్డు రోజులు, రాజకీయాలు, పల్చబడుతున్న రక్త సంబంధాలు, ఏవీ పట్టకుండా ఉంటున్న యువత, వాళ్ళ నిరుద్యోగ సమస్య, కుర్రకారుకి అమెరికా చదువుల మీదా, ఉద్యోగాల పట్ల మితిమీరిపోతున్న వ్యామోహం – లాంటి విషయాలు చోటు చేసుకున్నాయి. ఈ మాటల మధ్యలోనే ఇంటి యజమానురాలు శ్రీలక్ష్మిగారు రెండు కప్పులతో కాఫీ తెచ్చి టీపాయి మీద పెట్టి లోపలికి వెళ్ళిపోయింది. నేను కాఫీ తాగి, నిశ్శబ్దంగా హాలుని ఓసారి పరీక్షించి "నే వచ్చిన విషయం" అని ఆగిపోయాను. పరబ్రహ్మంగారు కాఫీ ఆఖరి గుక్క నోటి పాలు చేసి, భుజం మీద తువ్వాలుతో నోరు తుడుచుకుని అన్నాడు.

"మా వాడు పది రోజుల నాడు మీ అమ్మాయి గురించి అడిగితే – 'చెప్తాను' అని ఊరుకున్నాడండీ... మరో విశేషం ఏమిటంటే వాడికి అమెరికాలో ఉద్యోగం దొరికేటట్టు వుంది... ఈ కబురు ఈ మధ్యనే తెలిసింది."

"మీరూ మీ అబ్బాయి కూడా అదృష్టవంతులు.."

"ఏం అదృష్టం లెండి... జీతం రాళ్ళు ఒక్కటే ఎక్కువ... వాడక్కడా, మేం ఇక్కడా

అయిపోతాం" అంటూ పరబ్రహ్మంగారు లోపలికి చూసి, "ఏమే, రాఘవరావుగారికి ఏం చెబుదాం?" అంటూ వంటింట్లో వున్న భార్యను ప్రశ్నించాడు. ఆవిడ అక్కడి నుంచే "ఏం చెబుతాం" అనే మాటలతో పాటు హాల్లోకి వచ్చి, నన్ను చూసి, "వాడు పనిమీద బొంబాయి వెళ్ళాడు కదా... ఏ విషయం మేమే మీకు కబురు చేస్తాం" అంది.

నాకు మాట్లాడవల్సిందేం లేదనిపించి, పరబ్రహ్మంగారితో "మళ్ళీ కలుస్తాను... దయుంచండి" అంటూ లేవబోయాను.

"అవునూ... మీకు ఒక్కత్తే కూతురు కదూ..." అంటూ ప్రశ్నించాడు పరబ్రహ్మంగారు. నేను ఏ సమాధానం చెప్పకుండానే, ఆయనే తిరిగి, "అమ్మాయి పెళ్ళయి వెళ్ళిపోతే మీకు కాలక్షేపం అవడమే కష్టమే. ఇబ్బందే..." అన్నాడు. ఆయన ఉపయోగించిన కష్టమే అనే మాటతో మనసు ఏకీభవించినా, ఇబ్బందే అనే వాక్యం, నాకు అడోలా తగిలింది.

"దూరం సంబంధం అయితే మీకు మరీ బాధ... వయసు మీద పడ్డ తర్వాత తోడు వుండాలి..."

"కష్టమైనా, నష్టమైనా ఏం చేయలేం కదా... అన్నిటికి పైవాణ్ణి నమ్ముకోవాలి..."

"ఏదో విధంగా మనం సరిపెట్టుకుంటాం... కానీ పిల్లకాయలు అలా అనుకోరు కదా?"

"అనుభవం వాళ్ళకీ పాఠాలు నేర్పుతుంది..'

"రోజులు మారాయి... ఈ కాలంలో మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలూ సయ్యంటే సయ్యంటున్నారు... సవాళ్ళూ చేస్తున్నారు. విపరీత కాలం వచ్చింది..." శ్రీలక్ష్మిగారు సోఫాలో కూర్చుంటూ అంది...

"మా దేవి బుద్ధిమంతురాలు.. మీకా భయం అవసరం లేదు..."

"మీ గురించి మేం విన్నాలెండి" అంది శ్రీలక్ష్మిగారు...ఆడవాళ్ళు కర్ర విరగని, పాము చావని రకంగా మాట్లాడ్డంలో నేర్పరులని నాకు తెలుసుగానీ – ఆడపిల్ల తండ్రి ముందు చొరవగానూ, సాహసంగానూ, కాస్తంత వెక్కిరింతతోనూ మాట్లాడతారని నేను ఊహించ లేదు. సంబంధం ఖాయం కాకుండానే మెత్తని పులిలా మాటలు విసిరే ఆవిడ్ని చూస్తే నాకు భయం వేయలేదు గానీ – అనుమానం మాత్రం కలిగింది. కుడిచేత్తో రాజేశ్వరి నోరూ, ఎడం చేత్తో దేవి నోరూ ఒకేసారి అవలీలగా మూయగల నేర్పరి తనం ఆవిడలో దాగి వుందనిపించింది. నేను, ఆ దంపతుల దగ్గర శెలవు తీసుకుని బయటపడ్డాను...

❖ ❖ ❖

వారం తరువాత అనుకుంటాను – ఓ రోజు నేను పని మీద ఊళ్ళోకి వెళ్ళి – అటు నుంచి పాత స్నేహితుల్ని కలసి – రెండు గంటలు వాళ్ళతో కాలక్షేపం చేసి ఇంటికి వచ్చాను... నేను గుమ్మంలో అడుగుపెట్టకుండానే హాల్లో బొమ్మలా కూర్చుని ఎటో ఆలోచిస్తున్న రాజేశ్వరి కనబడింది. వెళ్ళి పక్కనే కూర్చుని, "అలా ఉన్నావేమిటి?" అన్నాను.

రాజేశ్వరి నన్ను చూసి మొదట బావురుమంది. మౌనంగా కొన్ని క్షణాలు నా వైపుచూసింది. వచ్చే ఎక్కుని బలవంతాన ఆపుకుంది.

"ఛీ... దేవికి బుద్ధి లేదండి... మీరుబాగా గారం చేసి దాన్ని పాడుచేశారు. అది స్వయం నిర్ణయాలు చేసేటంత పెద్దదయి పోయిందండీ..." అంటూ హిస్టీరియా వచ్చిన దానిలా గబగబా మాట్లాడేసింది.

"ఏం జరిగిందో చెప్పరాదా? ఏమయ్యింది నీకు?"

'మీ అమ్మాయికి – ఆ పరబ్రహ్మంగారి అబ్బాయి ఉత్తరం వ్రాశాడు. చదవండి" అంటూ రాజేశ్వరి చింపిన ఓ కవరు నా చేతిలో పెట్టింది... నేను అర్థం కాకుండానే కవరులోంచి కాగితాలు బయటకు తీశాను. నిజమే – అది, దేవి పేర వచ్చిన ఉత్తరం.

"ఈ ఉత్తరం దానికొచ్చింది... నువ్విలా చింపి చదవడం..."

"పెళ్ళి కాని ఆడపిల్లలకు పరాయి వాడెవడో ఉత్తరం వ్రాయడం ఏమిటని కోపం వచ్చింది.... ఆతృత చంపుకోలేకపోయాను... అందులో సంగతులు నేను చెప్పడం దేనికి – మీరే చదవండి... అన్నీ తెలుస్తాయి..." అంది, తలవంచుకని రాజేశ్వరి...

నేను కాగితాలు చేతిలోకి తీసుకున్నాను... కళ్ళజోడు సర్దుకున్నాను. నా గుండెలు అదోలా కొట్టుకోసాగాయి. కాని పని చేస్తున్నాన్ననిపించింది.

"దేవీ –

నీ ఉత్తరం అందింది... మన పెళ్ళి విషయంలో నువ్వు విధించిన షరతులు అననుగానీ – నన్ను ఒప్పించాలనే నీ ఆతృత, ఆవేదనా మాత్రం నాకు అర్థమయ్యాయి. నీ దృష్టిలోంచే చూస్తే అన్నీ బాగానే ఉన్నాయి. నువ్వే కాదు... నీ పరిస్థితుల్లో ఉన్న ఏ ఆడపిల్లయినా అలాగే ఆలోచిస్తుంది... మీ వాళ్ళకు నువ్వొక్కత్తివే సంతానం కాబట్టి నీకు నీ భవిష్యత్‌తోపాటు నీ తల్లిదండ్రుల భవిష్యత్ కూడా ఆలోచనల్లోకి వస్తుంది... నువ్వు పెళ్ళి అయిన వెంటనే నాతో అమెరికా రావడానికి నీకున్న ఇబ్బందులు చెప్పావు. నువ్వెక్కడ వున్నా నీతోపాటు తల్లిదండ్రులు కూడా ఉంటారని – అది ముఖ్యమైన విషయమని వ్రాశావు.... వాళ్ళు అక్కడికి వచ్చి మనతో వుంటే వాళ్ళకి ఎదురయ్యే సమస్యలు ఆలోచించావా, నువ్వు?? పైగా మరో సలహా అంటూ ఈ నగరంలోనే, ఈదేశంలోనే ఉద్యోగం చేసుకుంటూ వుంటే ఏమవుతుందని ప్రశ్నించావు? మనిషికి ఆశలుండవా? పైకి ఎదగాలని అనిపించదా?? మనిద్దరం స్నేహితులం... ఒకళ్ళ గురించి ఒకరికి తెలుసు. ప్రేమ బ్రతుక్కీ, భవిష్యత్‌కీ అవరోధం అయినప్పుడు – ఆ ప్రేమ, ముందు ముందు ఎలా మారుతుందో? ఏ వెర్రితలలు వేస్తుందో?? నువ్వేమో ప్రేమ అనుబంధాలు, రక్త సంబంధాలు – వీటి తర్వాతే వ్యక్తి ప్రాధాన్యతని గణనలోకి తీసుకోవాలంటావ్!! నేను చెప్పేదొకటే... నువ్వు మరోసారి, ఇంకోకసారి ఆలోచించు.. దారి దొరక్కపోదు. నువ్వో చిన్న కారణంతో నాకు దూరమయిపోతున్నావనే నిజాన్ని నేనూ భరించలేను.

నన్ను నమ్ము!! ఏ విషయమూ, నాకు బొంబాయి ఎడ్రసుకు వ్రాయి.

సుధీర్"

రాజేశ్వరి తల వంచుకని కూర్చున్నది, కూర్చున్నట్టే ఉంది... నాకు ఏం మాట్లాడాలో తెలియలేదు.

"ఈ ఉత్తరం మనం చదివామని దానికి తెలియడం మంచిది కాదు, దాన్ని దాచి పెట్టండి" అంది.

ఎక్కడో, దూరంగా, ఎక్కడికో ఆలోచిస్తున్నా నాకు రాజేశ్వరి మాటలు వినబడినట్లే అన్పించలేదు. నా ధోరణిలో రాజేశ్వరి వైపు చూస్తూ అన్నాను. "దేవి, మనం చూపించిన ప్రతీ సంబంధం ఎందుకు కాదంటోందో నీకు ఇప్పటికైనా అర్థమయ్యిందా?"

రాజేశ్వరి తల ఊపింది...

"నా కోసం నీ తల్లిదండ్రుల్ని ఫణంగా పెట్టు - అనే మగపిల్లవాళ్ళు అనాదిగా ఈ లోకంలో వుంటూనే వున్నారు. కానీ నీకోసం నా వాళ్ళను ఖర్చు వ్రాసేసుకోలేననే ఆడపిల్లలు కూడా ఈ రోజుల్లో ఎక్కువగానే వున్నారనిపిస్తోంది, నాకు..."

"నాకు భయంగా వుందండీ... దేవి, ఇలా వెర్రిగా మన గురించి ఆలోచిస్తూ జీవితంలో వెనుకబడిపోతుందేమో.."

నేను రాజేశ్వరి వైపు చూశాను. అప్పుడు నాకు రాజేశ్వరిలో ముమ్మూర్తులా కన్న తల్లి కనబడింది. ఆమె బాధపడినా, కన్నీరు కార్చినా, గుండెకోతకు బలి అయినా, లేక చిన్నపాటి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయినా అన్నిటికీ ఆమె అర్హురాలే - అన్పించింది.

"రాజేశ్వరీ... దాని బ్రతుక్కి మనం అడ్డు రాకూడదు... అందుకు ఏదో దారి ఆలోచిద్దాం... ఈ రోజుల్లో మనలాంటి వాళ్ళను అక్కున చేర్చుకునే ఎన్నో సంస్థలు బయలుదేరాయి. అలాగే ఆధ్యాత్మిక నిలయాలూ ఉన్నాయి. మన దేవి తన బాధ్యత గురించి ఆలోచిస్తోంది తప్ప పైనున్న పరమాత్మకి కూడా మన బాధ్యత పట్టాలనే ఆతృత ఉంటుందని... అది అర్థం చేసుకోలేకపోతోంది..."

"నిజమే... దానికి ఏదో విధంగా నచ్చచెప్పండి... బుజ్జగించండి.."

"నేను సుధీర్‌కి ఉత్తరం వ్రాస్తాను. లేదా, బొంబాయి వెళ్ళి అతగాడితో మాట్లాడతాను... నువ్వు ఈ ఉత్తరం గురించి దానికి చెప్పకు" అన్నాను.

రాజేశ్వరి తల ఊపింది....

❖ ❖ ❖

అర్థరాత్రి వేళ నాకు మెలకువ వచ్చింది. పక్కకి చూశాను. రాజేశ్వరి గాఢ నిద్రలో వుంది... పక్కలకూ పైకి చూశాను- నిద్ర పట్టక! దేవి గదిలో లైటు వెలుగుతోందన్న గుర్తుగా వెలుతురు వెంటిలేటర్స్‌లోంచి గోడపైన కనబడుతోంది... మామూలుగా అయితే

దేవి, ఏ ఆఫీసు పనో చూసుకుంటూ వుంటుందని నేను నిద్రలోకి వెళ్ళిపోయేవాణ్ణే...కానీ మనసు ఆగలేదు. నెమ్మదిగా మంచం దిగాను... అంతలో దేవి గదిలో వున్న ఫోన్ మోగిన చప్పుడు వినబడ్డం, అది దేవి ఎత్తిన సంగతీ తెలిసి – నేను నెమ్మదిగా దేవి గది దగ్గరకు వెళ్ళి గుమ్మం దగ్గరే ఆగిపోయాను.

అటు నుంచి ఎవరు మాట్లాడుతున్నారో తెలియదు... దేవి, మాత్రం ఊ, ఊ అంటూనే వుంది... రెండు మూడు నిమిషాలు దొర్లాయి... దేవి, 'సారీ సుధీర్' అంది... క్షణం ఆగింది.. ఆమె ఫోన్‌లో నెమ్మదిగా చెప్తున్నా, ఆ మాటలు నా చెవిని పడుతూనే ఉన్నాయి... "సారీ అని చెప్పానుగా సుధీర్... అవును...జీవితంలో పెళ్ళికి మించిన గొప్ప వేడుక లేదంటే నేను ఒప్పుకోను... అయినా నీ సంగతేమోగాని, నాకు వయసేం మించిపోలేదు... ఆడది – భర్తా, సంసారం, ఇల్లూ, పిల్లలూ ఇంకా ఇంకా చాలా సుఖాలకు తనే ముందుగా ఉరకలు వేస్తుంది, ఆశపడుతుంది. కానీ – అవి దొరకనంత మాత్రాన ఆడదాని బ్రతుకు గంగపాలై పోతుందనే కాంసెప్ట్‌తో నేను ఏకీభవించలేను. ఈ వేళ చాలామంది వేదాంతులు, తాత్వికులు ఆడది తన ఒంటరితనాన్ని చూసి రక్షణ కోసం, ఇంకా ఇంకా సంతానాభిలాషణనీ, భద్రతనీ, ఇంటినీ కోరుకుని – వాటి కోసం పరుగులుపెట్టకపోతే వాళ్ళివేళకన్నా ఎక్కువ స్వాతంత్ర్యాన్నీ, మగవాళ్ళతోపాటు ఈక్వాలిటీనీ పొందగల్గుతారని చెబుతున్నారు. ఈ విషయాలు నీకు తెలుసు...

కానీ – ఓ చిన్న మాట సుధీర్... ఈ వేళ నేనున్న పరిస్థితుల్లో రేపు మనం పడ్డామనుకో – మనకు ఒక్కతే కూతురు పుట్టి అది ఎవడినో ప్రేమించి వాడితో ఏ దూర ప్రదేశాలకో వెళ్ళిపోతానంటే మనమనసు చివుక్కుమనదా?? సారీ, సారీ – నా కోసం నువ్వు ఇండియాలో ఉండలేనప్పుడు – నేను నీ కోసం నా వాళ్ళను ఒదులుకని – అమెరికా రాలేను... నువ్వు చూసిన మరో అమ్మాయిని నువ్వు ఓకే చేసుకో... గుడ్‌లక్ టు యూ..."

దేవి ఫోన్ పెట్టేసింది... నేను ఆమె గదిలోకి వెళ్ళాను.

"మీరు నిద్రపోలేదా నాన్నగారూ" దేవి నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ ప్రశ్నించింది....

"లేదమ్మా..."

"నేను ఫోన్‌లో మాట్లాడిన మాటలు మీరు వినకపోతే ఫర్వాలేదు నాన్నగారూ! ఒకవేళ వినుంటే... మీరు నన్ను తిట్టండి.. కొట్టండి.. కానీ..."

నాకు ఏం మాట్లాడాలో తెలియలేదు..కానీ ఒకటి మాత్రం నిజం... రాజేశ్వరి దేవి గురించి తరచు 'అది చిన్నపిల్ల... దానికేం తెలియదండీ' అంటుంది.. లేకపోతే కోపగించుకుని ఏవేవో అంటుంది. అయితే, ఆ మాటలేవీ – నా కూతురు ముందు, దేవి ముందు నిలబడి నేను అనలేను... ఎందుకంటే – అది అంతే!!

❖